విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

జిల్లాలో 2.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు: జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర – ఏలూరు : ఏలూరు జిల్లాలో రూ .537 కోట్ల విలువ గల 2,62,798 మెట్రిక్ టన్నుల ధాన్యం 37,133 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ గురువారవ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రూ.122 కోట్లను 12,126 మంది రైతులకు చెల్లించామని తెలిపారు . మరో 18 వేల మంది రైతులకు సంబంధించి రూ.183 కోట్లు మొత్తాన్ని చెల్లింపు కోసం బ్యాంకులకు విడుదల చేశారన్నారు. సంబంధిత సొమ్ము రైతుల ఖాతాలకు జమ చేసే ప్రక్రియ జరుగుతున్నదన్నారు. జిల్లాలో పారదర్శకతతో నూతన విధానంలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర – కుక్కునూరు : కుక్కునూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు చేబ్రోలు గీతావాణి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం పాత భవనంలో నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

పాము కాటుకు విద్యార్థి మృతి

విశాలాంధ్ర – కుక్కునూరు : పెదరావిగూడెం గ్రామ పంచాయతీ బందారుగూడెం వలస ఆదివాసీ గ్రామంలో గురువారం కారం కిరణ్ (15) అనే విద్యార్థి పాము కాటుకు మృతి చెందాడు. చీరవెళ్ళి ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కిరణ్ క్రిస్టమస్ పండుగ సెలవులకు స్వగ్రామం బందారుగూడెం వెళ్ళాడు. గురువారం పొలంలోకి వెళ్ళగా అక్కడ పాము కాటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత

విశాలాంధ్ర – నూజివీడు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం మండలములోని దేవరగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు గురువారం నిర్వహించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లగాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీని గ్రామ ప్రముఖులు వైయస్ఆర్‌సీపీ నాయకులు పల్నాటి రఘురాం చేతుల మీదుగా జరిగింది . ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నక్క శ్రీనివాసరావు , విద్యా కమిటీ చైర్మన్ అద్దేపల్లి జగపతి సాయికుమార్, వార్డు మెంబర్లు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ

విశాలాంధ్ర – ఏలూరు : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.ఏలూరు నగర మహాసభ స్థానిక ఏఐటీయూసీ జిల్లా ఆఫీసులో బుధవారం రాత్రి జరిగినది. మహాసభ అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు.

17 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యలగాడ దుర్గారావు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా యలగాడ శివకుమార్, ఉపాధ్యక్షులుగా బంగారు దుర్గాప్రసాద్, పేడారి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా భజంత్రీ శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఇంటి అశోక్, మిరియాల రాజు, కోశాధికారిగా కసింకోట నాగేంద్ర, కౌన్సిల్ సభ్యులుగా బంగారు గురుప్రసాద్, అంతరాజ్ కిరణ్, కదరబోయిన భాస్కరరావు, మాదుగుల జగదీష్, వివేక్ పిదారి వంశి, బంగారు నాగమణి, తంగేళ్ళ ఉమా ఎన్నికయ్యారు. ఈ నూతన కమిటీని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె కృష్ణమాచార్యులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు తోర్లపాటి బాబు, కూనపాముల విఘ్నేష్, సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కడుపు కన్నయ్య, ఏలూరు మహిళా సంఘం కోశాధికారి మాపూరు విజయ, నాయకులు అభినందించారు.

పశ్చిమగోదావరి జిల్లా జిల్లా కలెక్టర్ ప్రశాంతి కుమారుడికి గవర్నర్ అభినందన

విశాలాంధ్ర – భీమవరం : అమ్మఒడి హ్యాండ్ రైటింగ్ అండ్ కాలిగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయి చేతిరాత పోటీలకు ఎంపికైన పశ్చిమగోదావరి జిల్లా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కుమారుడు జి.వితష్‌ని రాష్ట్ర గవర్నర్ అభినందించారు. విజయవాడ నివాసి జాతీయస్థాయి కాలిగ్రఫీ చేతిరాత ప్రత్యేక నిపుణులు భువనచంద్ర తరపున జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ రాజభవన్‌లో అభినందించారు.

ఆంగ్ల భాషలో చూడచక్కని చేతిరాతను చూసిన గవర్నర్ జివితష్ నీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయస్థాయి చేతిరాత ప్రత్యేక నిపుణులు పి భువనచంద్ర తో పాటు కాకినాడ ఎమ్మెల్యే కుమార్తె కురసాల సిరి కృష్ణ సంహిత, అంజలి, జయశ్రీ, మరేష్ , శ్రావ్యాంజలి, స్ఫూర్తి, హర్షిత, మనుశ్రీ, గవర్నర్ విద్యార్థులను అభినందించారు.

స్థానిక సమస్యలపై ఉద్యమించాలి

విశాలాంధ్ర –భీమవరం: ప్రజలెదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కరించే దిశగా పార్టీ శ్రేణులు అధికారులతో మమేకం కావాలని ఇదే సందర్భంగా పార్టీ శాఖలు బలోపేతం కావాలని సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు అన్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ శాఖా సమావేశం పి.యాకోబు అధ్యక్షతన గురువారం భీమవరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కోగృహాలు, జగనన్న ఇళ్ల పంపిణీ లో జగన్ అలసత్వం వహించడం దారుణమని, లబ్ధిదారులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలన్నారు.

భీమవరంలో మరిన్ని శాఖలు విస్తరించాలని పార్టీ జాతీయ మహాసభల నిర్ణయాల అమలులో శ్రేణులు నిమగ్నం కావాలని జనవరిలో సభ్యత్వాలను పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆకల రాము, పాలా త్రిమూర్తులు, అప్పల నాయుడు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మేధస్సుకు పదును పెట్టండి

విశాలాంధ్ర – కలిదిండి: విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుని మీ మేధస్సుకు పదును పెట్టాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఖర్చులకు వెనుకాడకుండా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేలా చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేష్ కుమార్, హెచ్ఎం స్వర్ణ కుమారి, జడ్పిటిసి బొర్రా. సత్యవతి, ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకం రెండో దశ వెంటనే పూర్తిచేయాలి

సీపీఐ నేతల డిమాండ్

విశాలాంధ్ర–నూజివీడు : చింతలపూడి ఎత్తిపోతల పథకం రెండో దశ పనులను వెంటనే ప్రారంభించి సత్వరం పూర్తి చేయాలని సీపీఐ నేతల డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయకట్టు గ్రామాల ప్రజల నుండి 10 వేల సంతకాల సేకరణ చేయాలని సీపీఐ నూజివీడు నియోజకవర్గ సమితి తీర్మానించింది. గురువారం స్థానిక పార్టీ కార్యాలయం అమర్‌భవన్‌లో పార్టీ కార్యవర్గసభ్యులు మడుపల్లి నాగేంద్రరావు అధ్యక్షతన నియోజకవర్గ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్ 2 విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తీర్మానించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఏలూరు జిల్లా సిపిఐ కార్యదర్శి మన్నం కృష్ణచైతన్య మాట్లాడుతూ ఏ సమస్యకయినా పరిష్కారం సాధించాలంటే పోరాటాలే శరణ్యమన్నారు. ప్రభుత్వాలు రైతు, కార్మిక వ్యతిరేక విధానాలతో ముందుకు వెళుతున్నాయన్నారు. రైతాంగ సమస్యలపై పోరాటాలు చేయాల్సి వుందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం విషయంలో రైతులను, అటవీ బంజరు భూములకు సాగు హక్కుల కోసం సాగుదారులను ఉద్యమాలకు సిద్ధం చేయాలన్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాల్సి వుందన్నారు. కేంద్రంలోని ప్రభుత్వం ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. దేశంలో చదువుకున్న నిరుద్యోగ యువత పట్టా చేతపట్టి కొలువుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. విద్యుత్ బిల్లును అన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తే మన రాష్ట్రం మాత్రం ఆమోదం తెలిపి వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టాలని చూస్తోందని, ఇదే జరిగితే రైతులపై భారం పడుతుందని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న భూసమస్యలపై ఆందోళన చేయాల్సిన అవసరం వుందన్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్టు వచ్చి 50 ఏళ్ళు పూర్తయినా నేటికి ఫలితం తేలని భూములు లక్షల ఎకరాలు వున్నాయన్నారు. అటవీ, బంజరు, ప్రభుత్వ భూములలో సాగులో వున్న పేదలు వాటిపై హక్కులు సాధించకపోతే భవిష్యత్తులో నష్టపోయే ప్రమాదం వుందన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తుకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు లేవని, ఉచితాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో సాగు నీటి కోసం చింతలపూడి ఎత్తిపోతల పథకం ఎంతో అవసరం అన్నారు. దీని సాధన కోసం ఉద్యమించడానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, రైతు సంఘం అధ్యక్షులు రాయంకుల లక్ష్మణరావు, దిగవల్లి పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు గుంటక ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ

విశాలాంధ్ర – లింగపాలెం : లింగపాలెం మండలంలో 2020 మార్చి నుంచి 2022 మార్చి వరకు ఉపాధి పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర స్థాయి రీసోర్స్‌పర్సన్ కనకారావు వెల్లడించారు. పనులకు సంబంధించి ప్రతీ గ్రామంలో గ్రామసభలు నిర్వహిస్తామని అన్నారు. క్షేత్ర, సాంకేతిక స్థాయి సహాయకులు పూర్తి వివరాలతో ఉండాలని కోరారు.

జనవరి 10 వరకు గ్రామాలలో తనిఖీలు ఉంటాయని తెలిపారు. 2020 నుంచి 2022 మార్చి వరకు పంచాయతీరాజ్, సర్వశిక్షా అభియాన్, గ్రామీణ నీటి పారుదల తదితర శాఖల పనులను మండలంలో దాదాపు రూ. 31 కోట్లతో చేశారని ఈయన తెలిపారు. గ్రామస్థాయి తనిఖీల అనంతరం మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహించి పనుల తనిఖీల వివరాల వెల్లడిస్తామని తెలిపారు. సామాజిక తనిఖీలకు సంబంధించి ఉపాధి పనులు చేయించిన సిబ్బందికి అవగాహన కల్పించారు. తనిఖీలలో పది మంది జిల్లా రీసోర్స్‌పర్సన్‌లు పాల్గొంటారని అన్నారు. ఎంపిడిఓ ఆశీర్వాదం, ఉపాధి ఎపిఓ మల్లేశ్వరరావు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాసుల మాయాజాలం.. అధికారుల మౌనం!

విశాలాంధ్ర – ఉండి : అంగబలం, ఆర్థిక బలం, రాజకీయ బలం ఉంటే చాలు ఏదైనా సజావుగా సాగిపోతుంది అనడంలో ఒక చక్కని ఉదాహరణ. ఉండి పులి బొమ్మ రోడ్డులో ఉన్న చేపల చెరువు అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పేదలకు ఇంటి స్థలాలు పథకాన్ని తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చిన స్థలాన్ని ఆనుకొని చాపల చెరువులు తవ్వటం గమనార్హం.

దీనికి సంబంధించి స్థానిక తాసిల్దార్‌ను విశాలాంధ్ర విలేఖరి వివరణ కోరగా గతంలో తహసిల్దార్‌గా పనిచేసిన కృష్ణ జ్యోతి అనుమతులు ఇచ్చారని, ఆ చెరువు తవ్వకాలకు, నాకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వినట్లయితే వాటిని గండి కొడతానని తహసిల్దార్ వివరణ ఇచ్చినప్పటికీ అక్కడ పనులు మాత్రం సజావుగా జరుగుతూనే ఉన్నాయి. దీంతో ఆ చెరువుకు ఆనుకొని ఉన్న రైతు సాగి రాజు సాంబశివరాజు నాకు లేని అనుమతులు వారికి ఎలా ఇచ్చారు దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని నాకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు అధికార పార్టీ వర్గానికి చెందిన వారికి మద్దతు తెలుపుతూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జగనన్న కాలనీకి ఎంతో దూరంగా ఉన్నా ఆక్వా జోన్ లో ఉన్న నాకు లేని అనుమతులు జగనన్న కాలనీకి ఆనుకొని ఉన్న వారికి అనుమతులు ఎలా ఇచ్చారు అని ప్రశ్నించారు. అంతేకాకుండా అధికారులు అధికార పార్టీ నాయకుల ఇచ్చిన కాసుల ముసుగులో ఊగుసులాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని లేని పక్షంలో తాను న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు.

కందుకూరు ఘటనపై శివరామరాజు దిగ్భ్రాంతి

విశాలాంధ్ర –ఉండి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కందుకూరు బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో టిడిపికి చెందిన 8 మంది కార్యకర్తలు మరణించడం పట్ల స్థానిక మాజీ శాసనసభ్యులు శివ, స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కందుకూరు ఘటన రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మంది టిడిపి కార్యకర్తల్లో విషాదం నింపిందన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబానికి శివరామరాజు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

త్వరితగతిన భూ రీ సర్వే పనులు

విశాలాంధ్ర – భీమవరం : విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుండి గురువారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం, రీసర్వే, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫెరెన్సులో భీమవరం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ జె వి మురళి, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలో రీ సర్వే పనులు త్వరితగతిన చేపట్టేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. రీ సర్వేపై ఇప్పటికే జిల్లా, మండల, క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందని, అందులో రీ సర్వేపై అన్ని రకాల అంశాలను తెలియజేశామని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జిల్లా జాయింట్ కలెక్టరు జె వి .మురళి, డిఆర్ఓ దాసి రాజు, ఆర్ అండ్ బి శాఖ అధికారి యస్. లోకేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వేంకటేశ్వరరావు, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జాషువా, పంచాయతీరాజ్ శాఖ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వికాసబాబు మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర – ఏలూరు : ఎస్‌సి యువకుడు యాళ్ళ వికాస బాబు మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్ సి, ఎస్‌టి కుల సంఘాల జాయింట్ యాక్షన్ (జేఏసీ) కమిటీ డిమాండ్ చేసింది. గురువారం ఏలూరు జిల్లా పోలీస్ ఎస్‌పిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం లేడీస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ చాగంటి సంజీవ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఎస్ సి, ఎస్ టిలపై దాడులు, హత్యా కాండలు, మానభంగాలు ఎక్కువ అయిపోతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. కైకలూరు మండలం పల్లెవాడ శివారు చిన్న రామవరం గ్రామానికి చెందిన ఎస్ సి కులానికి చెందిన యాళ్ళ వికాస బాబు ని సెప్టెంబర్ 16న తోట శ్రీను , అతని కుమారుడు, తోట శివశంకర్, ఇతని కుమారుడు ఈ నలుగురు విపరీతంగా కొట్టడం వలన సెప్టెంబరు 25వ తేదీన చనిపోయాడన్నారు. యాళ్ళ వికాస బాబు మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ కోఆర్డినేటర్ నేతల రమేష్ బాబు మాట్లాడుతూ ముద్దాయిలపై 302 , ఎస్ సి, ఎస్ టి, అట్రాసిటీ కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కైకలూరు రూరల్ ఎస్ఐ, ఏఎస్ఐ ని సస్పెండ్ చేయాలని లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మృతుడి తండ్రి యాళ్ళ రాజు, అలగా రవి కుమార్, జీపి డేనీయల్, బొడ్డు నోబుల్, జాలా బాలాజీ, భూపతి అప్పారావు, బంగారు రజని, కాపుదాసి రవి, తోట రాజు, తేరా అలెక్స్, కర్ణికోటి దిలీప్, తైదుల శేఖర్, కనికెళ్ళ మురళీ కృష్ణ, చిన్నం విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌సి ఆర్గానిక్ కెమిస్ట్రీ స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర – పెంటపాడు : డిఆర్‌జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం నందు ఎపిపి జి.సెట్ 2022 సంబంధించి స్పాట్ అడ్మిషన్లు జనవరి 3వ తేదీన జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం ఎస్ సి (ఆర్గానిక్ కెమిస్ట్రీ) విభాగంలో ఉన్న ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా పూర్తి చేస్తారని, దీనికి ఎపిపిజి సెట్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులని ఆయన తెలిపారు. కోర్సులో స్పాట్ అడ్మిషన్లు పొందుగోరువారు జనవరి 3న ఉదయం 10గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రూ.500 ప్రాసెసింగ్ ఫీజుతో కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ ఎం.శ్యాంబాబు తెలిపారు. మరిన్ని వివరాలకు రసాయన శాస్త్ర శాఖ అధిపతి ఎం.వి.ప్రేమ్ సాగర్‌ను 8247608424, 9959991246 ఫోన్ నెంబర్లు ద్వారా సంప్రదించాలని తెలిపారు.

2న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా మహాసభలు

విశాలాంధ్ర –భీమవరం: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా మహాసభలను జనవరి 2వ తేదీన జరుపనున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి తెలిపారు. గురువారం ఆయన భీమవరంలో మీడియాతో మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా ఆవిర్భవించిన తమ పార్టీ నాటి నుండి నేటి వరకు ప్రజల పక్షాన అలుపెరుగని ఉద్యమాలు నిర్వహించిందని గుర్తుచేశారు. వ్యవసాయాధారిత పశ్చిమగోదావరి జిల్లా నేటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉండటం దురదృష్టమన్నారు. జిల్లాలో అనేక సమస్యలున్నాయని వాటిపై జిల్లా మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి పి.వి.సుందరరామరాజు తదితర నేతలు విచ్చేసి తమ సందేశాలిస్తారని ఆయన అన్నారు. మహా సభల్లో భాగంగా జిల్లా కార్యదర్శి తో పాటు జిల్లా నూతన కార్యవర్గాన్ని, మూడు డివిజన్లు కు సంబంధించి కార్యదర్శులు ఇతర సభ్యులనుఎన్నుకుంటారన్నారు. జిల్లాలోని పార్టీ శ్రేణులు మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంబేద్కర్ స్ఫూర్తితో మహిళలు సాధికారత సాధించాలి

దళిత జెఏసి జాతీయ కన్వీనర్ పెరికే వరప్రసాదరావు

విశాలాంధ్ర –భీమవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో మహిళలు సాధికారత సాధించాలని ఓనర్ షిప్, లీడర్ షిప్ తో ముందుకెళ్లాలని సాధికారత సాధించాలి దళిత జెఎసి జాతీయ కన్వీనర్ పెరికే వరప్రసాదరావు పిలుపునిచ్చారు. రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాజ్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమన్నారు. కుటీర పరిశ్రమలు నిర్వహించుకునే లా పేద మహిళలకు ట్రైనింగ్ ఇప్పించి వారు పారిశ్రామికవేత్తలు గా ఎదగడానికి రాజ్ ట్రస్ట్ చొరవ చూపడం అభినందనీయమన్నారు. గంటా సుందర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు గంట రాజ్ కుమార్, నాయకులు తానేటి మోహన్ రావు, జె.ఎన్.వి.గోపాలన్, జాతీయ బి.సి. సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, పాలపర్తి జోనా, చెరుకువాడ రంగసాయి, ఆరేటి ప్రకాష్, జిల్లా మైనారిటీ సెల్ జిల్లా నాయకులు కరీముల్లా భాషా, డాక్టర్ పట్టా దేవరాజ్ , దొడ్డిగర్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో పని చేస్తాం

విశాలాంధ్ర – కలిదిండి : ప్రజల మౌలిక అవసరాలు తీర్చడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. గురువారం కలిదిండిలోని ఇందిరా కాలనీలో రూ 4 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ, కలిదిండిలో-2లో నూతన సచివాలయానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన సంస్కరణలలో భాగంగా గ్రామ సచివాలయ వ్యవస్థను మరింత బలోపేతం చేసే క్రమంలో గ్రామ సచివాలయాల పరిధిలో రూ కోటి ఖర్చుతో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పిఆర్ డిఈ ఈ సురేష్ బాబు, ఏఈ శ్రీనివాసరావు, జడ్పిటిసి బొర్రా. సత్యవతి, ఎంపీపీ చందన. ఉమా మహేశ్వర రావు, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, ఎంపీటీసీలు నీలి. సుమన్, చాంద్ బాషా, ఏఎంసి చైర్మన్ బ్రహ్మాజీ, సర్పంచి మని ముక్కు మారుతి ప్రసన్న, నంబూరి. శ్రీదేవి, ఎస్ కే చాన్, వి. రామారావు, ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర, "ఆగిరిపల్లి: చొప్పరమెట్ల గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో చొప్పరమెట్ల వైసిపి అధ్యక్షులు పల్లగాని వెంకట కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ అమ్మ ఒడి అనే పథకంతో పతి విద్యార్థి అమ్మకు తోడై నిలిచి, ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయి చదువులు కోసం గోరుముద్ద ,అమ్మ ఒడి ,విద్యా కానుక ,విద్యా దేవన, వసతి కానుక ,ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా ప్రతి పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వాన్ని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన చొప్పరమెట్ల గ్రామ రథ సారథులు, కూరాకుల వడ్డీ కాసులు, చొప్పరమెట్ల వార్డ్ నెంబర్ కూరాకుల సాంబశివ పంగిడేశ్వరరావు స్కూల్ హెడ్మాస్టర్ శివకుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

విస్తారంగా పొగ మంచు

విశాలాంధ్ర – జీలుగుమిల్లి : ఏజన్సీ గ్రామాలలో గత రెండు రోజులుగా విస్తారంగా పొగ మంచు కురుస్తోంది. గురువారం ఉదయం 10 గంటలైన జీలుగుమిల్లి, పరిసర ప్రాంతాలలో విపరీతమైన మంచు కురుస్తోంది. దీనివలన జీడిమామిడి తోటలు పూత మీద ఉండటంతో ఆ పూత మాడిపోయే పరిస్థితి నెలకొని ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా పొగాకు తోటలు ఈ మంచు వలన ఆకుముడత, తెగుళ్ల వచ్చే పరిస్థితి ఉందని రైతులు దిగులు చెందుతున్నారు. రహదారులపై వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనిపించడం లేదని వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగ మంచు వర్షాన్ని తలపిస్తోందని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

విద్యతో పేదరికం దూరం

విశాలాంధ్ర – పెనుమంత్ర : పేదలు పేదరికంపై గెలవాలంటే దానికి ఒకే ఒక్క ఆయుధం విద్యని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన జీవితం ద్వారా స్పష్టం చేశారని, ఆయన ఆశయాల స్ఫూర్తిగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నారని మండల ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు) అన్నారు. బుధవారం ఆలమూరు గ్రామంలోని వైయస్ రాజశేఖర్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను అందజేసే కార్యక్రమాన్ని ఎంపీపీ వాసు ప్రారంభించారు.

ఎంపీపీ మాట్లాడుతూ మన పిల్లలకు ఇవ్వగలిగిన ఆస్తి చదివే అని అన్నారు. మంచి చదువులు వారి తలరాతను మారుస్తాయని గుర్తించిన ముఖ్యమంత్రి విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. జెడ్పిటిసి కర్రి గౌరీ సుభాషిని వేణుబాబు, స్కూల్ చైర్మన్ పలివెల ప్రేమ్ కుమార్, ఎంపీటీసీ పలివెల ఆశా లత, ఉపసర్పంచ్ కె.సుబ్బిరెడ్డి, మాజీ సర్పంచ్ కె.సత్తిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వి. అనంతలక్ష్మి, గంజి విక్టర్ ఇమ్మానుయేల్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర – తణుకు : పట్టణంలోని 8వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాలు శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు అడుగడుగునా మంత్రి కారుమూరికి హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య వైసీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతికి మిల్లర్ల నిరాకరణ

ఆందోళనలో రైతులు

విశాలాంధ్ర – లింగపాలెం : లింగపాలెం మండలం నుంచి మిల్లర్లకు పంపిన దాదాపు వెయ్యి క్వింటాళ్ళ ధాన్యాన్ని దిగుమతి చేసుకోకపోవటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నూక శాతం అధికంగా ఉందనే నెపంతో మిల్లర్లు దిగుమతి చేసుకోవటం లేదు. 33 శాతం వరకు ముక్కయితే మిల్లర్లు దించుకోవాలి. కాని ముక్క శాతం 44 నుంచి 50 వరకు ఉందని, ఒక శాతానికి రూ. 5 చొప్పున చెల్లిస్తే దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు ఒత్తిడి తెస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలం నుంచి బుధ, గురువారాలలో 10 లారీలలో ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తీసుకెళ్ళారు. ఈ లారీలలో ధాన్యం దిగుమతి చేసుకుంటే తిరిగి లారీలు మండలానికి రావాల్సి ఉంది. అంతేకాకుండా గోనె సంచులు కూడా వస్తాయి. లారీలలో ధాన్యం అలాగే ఉండటంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మండలంలో కళ్ళాల్లో ఉన్న ధాన్యం ఎగుమతుల కోసం సిద్ధంగా ఉన్న రైతులు లారీల కోసం రేయింబవళ్ళు ఎదురు చూసుకుంటూ ఉన్నారు. ఈ ఏడాది వాతావరణ ప్రభావంతో కోతలు జాప్యం అయ్యాయి. దీంతో ధాన్యం కొద్దిగా ముక్కవుతుందని, కాని మిల్లరు చెప్పినంత అవ్వటంలేదని, డబ్బులు కోసం తమను ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

CHANGE OF NAME

I, **JOGI LAKSHMI (New Name), W/o SRINIVASA RAO,** Previously Called **JOGI LAXMI (Old Name),** R/o D. No. 3-7/1, Somaraju cheruvu, Tamarada, Penugonda Mandal, West Godavari District, A.P, Pin 534324, Now Changed my Name from **JOGI LAXMI (Old Name) to JOGI LAKSHMI (New Name).** Today onwards Use my New Name for all further Transactions.

దస్తావేజులు పోయినవి

కొయ్యలగూడెం మండలం ఎర్రంపేట గ్రామానికి చెందిన **అడపా కాంతారావు తండ్రి నరసింహారావు, కాంతారావుకు** ఎర్రంపేట రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ **149/1B** లో రెండు ఎకరాల 10 సెంట్లు వ్యవసాయ భూమి కలదు ఎర్రంపేట గ్రామం నుండి కొయ్యల గూడెం వచ్చు మార్గంలో **24-12-2022** తేదీన పొలం దస్తావేజులు పోయినవి దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు.

అడపా కాంతారావు
తండ్రి నరసింహారావు
కొయ్యలగూడెం మండలం
ఎర్రం పేట గ్రామం
ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
సెల్ నెంబర్: 9618383632.

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

ఉచితంగా న్యాయ సహాయం

విశాలాంధ్ర – ఏలూరు : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి రాజేశ్వరి ఏలూరు జిల్లా కారాగారాన్ని గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకోలేని వారికి జిల్లా న్యాయ సేవాదికార సంస్థ ఉచితంగా న్యాయదిని ఏర్పాటు చేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని

తెలియజేశారు. కుటుంబ సభ్యులకు కూడా ఏ విధమైన న్యాయ సహాయం కావాల్సిన జిల్లా న్యాయ సేవా సంస్థకు అర్జీ పెట్టుకుంటే పరిశీలిస్తామన్నారు. ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాలను, తాగునీరును పరిశీలించి వారికి అందుతున్న వైద్య సహాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏలూరు పరిధిలోని శనివారం పేటలోని ప్రభుత్వ బాలుర వసతు గృహాన్ని సందర్శించి బాలలకు అందుతున్న ఆహారం, తాగనీరు, వైద్య సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్య పట్ల శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర – కొయ్యలగూడెం : ప్రతి విద్యార్థి చదువు పట్ల శ్రద్ధ వహించాలని జడ్పిటిసి సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలంలో రాజవరం గ్రామంలో బి ఎస్ ఆర్ జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద 8వ తరగతి చదువుతున్న 99 మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన ట్యాబ్ లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా

ముఖ్య అతిథిగా హాజరైన దాసరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ విద్యార్థుల చదువు కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటూ విద్యార్థుల భవిష్యత్తు కోసం నాడు నేడు ప్రవేశపెట్టి పాఠశాలలను అభివృద్ధి చేస్తూ సెలవు రోజులలో కూడా ఇంటి వద్దనే ఉండి విద్యార్థులు చదువు కోవడానికి వారి మేధో శక్తి పెంచడం కోసం ట్యాబ్ లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని చదువులలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాంబర్ మండల అధ్యక్షులు ఏలేటి చిన్న తుక్కయ్య, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వంకదార కృష్ణమూర్తి, విద్యా కమిటీ చైర్మన్ ఏలేటి రాజు, ఉప సర్పంచ్ అనంతల సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం...

– బండి అందించిన తాతాజీ....

విశాలాంధ్ర – పాలకొల్లు : పాలకొల్లు పట్టణం 16 వ వార్డులో ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భీమనాదం లక్ష్మి అనే మహిళ తన కొడుకు కాయకూరల వ్యాపారం చేసుకొనేందుకు తోపుడు బండి కావాలని, వైసిపి పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ ని కోరింది. స్పందించిన తాతాజీ గురువారం తోపుడు బండిని స్వయంగా ఇంటికి

తీసుకువెళ్లి లక్ష్మి కుమారుడికి అందజేసి మానవత్వం చాటుకున్నారు. భీమనాథం లక్ష్మి కుటుంబ సభ్యులు యడ్ల తాతాజీ కి కృతజ్ఞతలు తెలిపారు. బండి ఇచ్చినందుకు సంతోషంగా ఉందని , మీ మేలు ఎన్నడూ మర్చిపోలేనని తాతాజి ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జోగాడ ఉమామహేశ్వరావు, బెజ్జవరపు నాగరాజు, రేలంగి శ్రీను, పెట్టా కిరణ్, పెట్టా మూర్తి, ఆళ్ళ వీరన్న , చెన్ను విజయ్, కొరగింజల హనుమంతు, జోగి వడ్డీకాసులు, పాలపర్తి కృపనాథ్, పసుపులేటి వీరాస్వామి, తెన్నేటి శ్యామ్యూల్, పడమటి నాగబాబు, షేక్, పిల్లా అప్పాజి, కొండా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర – అమలాపురం : అల్లవరం మండలం మొగళ్లమూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు గురువారం అమలాపురం పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా, మొట్టమొదటిసారిగా జగనన్న ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల

చదువుకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యాభివృద్ధి కోసం జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న గోరుముద్ద వంటి అనేక పథకాలను జగనన్న ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. మన బడి, నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, విద్యా కమిటీ చైర్మన్ సాపే పార్థసారథి, చిట్టిబాబు, చిరంజీవి, ఇతర ప్రజా ప్రతినిధులు, పాఠశాల హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రాజకీయం చేస్తారా?

మండల ఉపాధ్యక్షుడు ఆగ్రహం

విశాలాంధ్ర – యు కొత్తపల్లి : చదువులు నేర్పాల్సిన పాఠశాలలో కొమరగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రాజకీయం చేస్తున్నారని, అలాంటప్పుడు ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి వస్తే మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తామని వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్ కుమార్ (నాని) అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ట్యాబులను స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులను పిలవకుండా పంపిణీ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కొమరగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారావు దానికి భిన్నంగా పంపిణీ చేశారని అయన అన్నారు. ప్రధానోపాధ్యాయుని వివరణ కోరగా వైస్ ఎంపీపీ నాని మండల స్థాయిలో పంపిణీ చేశారని, అందువలన పిలవలేదని స్థానికంగా ఉన్న నాయకులకు ఫోన్లో తెలియజేశానన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘించినందున శాఖాపరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

దోచుకోవడం, దాచుకోవడం మాజీ ఎమ్మెల్యేకే చెల్లింది

-వైసీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద ధ్వజం

విశాలాంధ్ర – రాజానగరం : దోచుకోవడం, దాచుకోవడం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌కే చెల్లిందని వైసీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద విమర్శించారు. రాజానగరంలోని వైసీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల టీడీపీ పాలనలో కొండలు, గుట్టలు, ఇసుక ఏదీ వదలకుండా దోచుకున్నారని దుయ్యబట్టారు. జగనన్న కాలనీలకు మట్టి తోలుతుంటే దొచేస్తున్నారని ఆరోపణలు చేయడం చూస్తుంటే పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించిన చందాన ఉందన్నారు. ఇక నైనా ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుందేటి ప్రసాద్, నాయకులు ప్రగడ చక్రి, గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణా, అడబాల చిన్నబాబు, గండి నాని బాబు, సంగీత ప్రసాద్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడి పందాలపై దాడి

విశాలాంధ్ర– జీలుగుమిల్లి: కోడిపందాల స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ ఐ వి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం వంక వారి గూడెం పంచాయతీ పరిధిలో గల సీమల వారి గూడెం గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ దాడిలో 2 పందెం కోళ్ళు రూ.3వేల 8 వందల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

కామన్ ఫెసిలిటీ సెంటర్ స్థాపనకు ప్రోత్సాహం...

విశాలాంధ్ర – భీమవరం : జిల్లాల్లో క్లస్టర్ డెవలప్మెంట్ స్కీం కింద కామన్ ఫెసిలిటీ సెంటర్స్ ను స్థాపించేందుకు ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ జె వి మురళి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరు

కార్యాలయంలో తన చాంబర్ లో నిర్వహించిన డిస్టిక్ ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో క్లస్టర్ డెవలప్మెంట్ స్కీం కింద కామన్ ఫెసిలిటీస్ సెంటర్ స్థాపించేందుకు కేంద్ర ప్రభుత్వం 70శాతం రాష్ట్రప్రభుత్వం, 15 శాతం లబ్దిదారుని వాటా 15 శాతం ఉంటుందని తెలిపారు. భీమవరంలో రెండు క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం మంజూరు చేయడం జరిగిందని, ఒకటి సీ ఫుడ్ వేస్ట్ ప్రాసెసింగ్ అండ్ వాల్యూ ఎడిషన్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద రూ.30 కోట్లతో మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.జిల్లాలో పరిశ్రమల స్థాపనకు గత సమావేశం నుండి ఇప్పటివరకు 16 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 9 పరిశ్రమలకు అనుమతి మంజూరు చేశారని , మిగిలిన 7 దరఖాస్తులు త్వరిత గతిన పరిష్కరించాలని జాయింటు కలెక్టరు సూచించారు.జిల్లాలో 53 మంది పరిశ్రమ దారులకు వివిధ రాయితీల కింద రూ.1కోటి 50 లక్షల 69 వేల 648 మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు,ఎల్ డి ఎం రమణ , పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ ఈ వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఈ ఈ ఫీర్ అహమద్ ఖాన్ , పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు టి శివరామప్రసాద్ , ఏపీ ఎస్ ఎఫ్ సి అధికారి శ్రీనాథ్ , కమర్షియల్ టాక్స్ అధికారి రాజ్ కుమార్, ఎపిఐఐసి జిఎం కృష్ణప్రసాద్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ త్రినాధ రావు , జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఏ. దుర్గేష్ , జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి బి. శ్రీనివాసరావు, శ్రీజిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి కె. శోభారాణి , చాంబర్ ఆఫ్ కామర్స్ నుండి సత్యనారాయణ రాజు , తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులమయం

విశాలాంధ్ర – గోపాలపురం : అందరికీ సంక్షేమ పథకాలు ఇస్తున్నానంటూనే రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెట్టిన ఘనుడు జగన్ రెడ్డి అని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ మద్దిపాటి వెంకటరాజు విమర్శించారు. గురువారం మండలంలోని బీమోలు గ్రామంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ముందుగా వంగవీటి మోహన రంగ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వం చేస్తున్న చర్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ కందుకూరులో చంద్రబాబు పర్యటనలో జరిగిన అపశృతిలో మృతి చెందిన కార్యకర్తలకు ప్రత్యేక నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం గా అవతరించిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు వేసిన ఘనత చంద్రబాబు దేనని తెలిపారు.ఒక పక్క సంక్షేమ పథకాన్ని ఇస్తున్నానంటూ మరోవైపు నిత్యావసర వస్తువుల కర్లను నియంత్రించకుండా ప్రజలు నడ్డి విరిస్తున్నాడని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొర్లపాటి రాము, మద్దిపాటి రమేష్, జ్యేష్ఠ శ్రీనివాసరావు, నూతంగి దొరబాబు, బెజవాడ మోహన్, దాకారపు అప్పారావు, గద్దె వెంకటేశ్వరరావు సిరికొండ సాయిబాబు, అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'చేతన'పై అవగాహన

విశాలాంధ్ర – ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఓమ్మంగి శ్రీ భారతి విద్యానికేతన్, జూనియర్ కాలేజీలో జిల్లా ఎస్పి ఎం రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు, పెద్దాపురం డిఎస్పి సుంకర మురళీమోహన్ సూచన మేరకు గురువారం 'చేతన'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని, గేమ్‌లు లాంటివి ఆడకూడదని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటిపి నెంబర్లు చెప్పకూడదని తదితర పలు అంశాలపై అవగాహన కల్పించారు. దానిలో భాగంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలు, ఉమెన్ సేఫ్టీ, రోడ్‌పై ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు కే కిషోర్ బాబు హాజరయ్యారు. ప్రత్తిపాడు ఎస్‌ఐ కే సుధాకర్, శ్రీ భారతి విద్యా నికేతన్ కరెస్పాండెంట్ సుంకర వీరబాబు, ప్రిన్సిపాల్ ఆర్ బుల్లి రామన్న, ఉపాధ్యాయులు, మహిళ పోలీసులు సుమిత్ర, వర్ధని, ప్రసన్న, రాధ, ముక్తారి, పాల్గొన్నారు.

కేసీబీఎస్‌లో వైద్యశిబిరం

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ శతాబ్ది ఉత్సావాల్లో భాగంగా గురువారం సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద సభ్యులకు వైద్యశిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరాన్ని కేసీబీఎస్

అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. పెద్దఎత్తున సభ్యులు వైద్యశిబిరంలో పాల్గొన్ని పలురకాల వైద్యపరీక్షలు చేయించుకున్నారు. జనరల్ మెడిసిన్‌కు సంబంధించి డాక్టర్ అహల్యం, ఈఎన్‌టీ వైద్యురాలు ఎం ప్రత్యూష, పీఆర్వో వీరేంద్ర సేవలందించారు. ఈ కార్యక్రమంలో కేసీబీఎస్ ఉపాధ్యక్షుడు ఆర్ వీరరాజేంద్రకుమార్, కార్యదర్శి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివబాలయోగి, కోసూరి లక్ష్మిప్రసాదలావణ్య, ఎం వెంకటరమణ, మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉంది

విశాలాంధ్ర –భీమవరం: రాజ్యాంగానికి ప్రమాదం పొంచివుందని దళితులంతా సంఘటితం కావాలని మను ధర్మ శాస్త్రాన్ని రుద్దడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మను స్మృతిని తగలపెట్టాలి పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సును గురువారం దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ అధ్యక్షతన భీమవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ అనువాద విశ్లేషకులు దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ రాజ్యాధికారం దిశా దళితులు సంఘటితం కావాలని అప్పుడే అంబెద్కర్ వారసులమతామన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. దళిత జెఎసి జాతీయ కన్వీనర్ పెరికే వరప్రసాదరావు మాట్లాడుతూ మను స్మృతి తో రాజ్యాంగానికి ప్రమాదం పొంచివుందని దళితులంతా అప్రమత్తం కావాలన్నారు. కార్యక్రమంలో భాగంగా దాసరి చెన్నకేశవులు రచించిన భారత రాజ్యాంగాన్ని సదస్సులో ఆవిష్కరించారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తానేటి మోహన్ రావు, జె.ఎస్.వి.గోపాలన్, రాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు గంట రాజ్ కుమార్, జాతీయ బి.సి. సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, పాలపర్తి జోనా, చెరుకువాడ రంగసాయి, ఆరేటి ప్రకాష్, జిల్లా మైనారిటీ సెల్ జిల్లా నాయకులు కరీముల్లా భాషా, డాక్టర్ పట్టా దేవరాజ్ , దొడ్డిగర్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవా హైక్రాస్ ధరలను ప్రకటించిన టయోటా కిర్లోస్కర్ మోటర్

రాజమండ్రి : టయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకెఎం) తమ నూతన ఇన్నోవా హైక్రాస్ ధరలను వెల్లడించింది. టయోటా విడుదల చేసిన ఈ నూతన వాహనం పద్దెనిమిది లక్షల ముప్పై వేల రూపాయల నుంచి ఇరవై ఎనిమిది లక్షల తొంబై వేల రూపాయలు (ఎక్స్‌షోరూమ్)లో లభిస్తుందని టీకెఎం సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ చెప్పారు. టయోటా ఈ సరికొత్త కారును నవంబర్ 2022న విడుదల చేయడంతో పాటుగా బుకింగ్స్ కూడా ప్రారంభించిందన్నారు. ఎక్స్ షోరూమ్ ధరలు గ్రేడ్ ల వారీగా జెడ్‌ఎక్స్ (ఓ) రూ. 28,97,000, జెడ్‌ఎక్స్-రూ. 28,33,000, వీఎక్స్8 ఎస్-రూ. 24,06,000, వీఎక్స్7 ఎస్-రూ.24,01,000, గాసోలిన్ జీఎక్స్8 ఎస్-రూ.19,20,000, జీఎక్స్7 ఎస్-రూ.19,15,000, జీ8 ఎస్-రూ.18,35,000, జీ7 ఎస్-రూ. 18,30,000 గా నిర్ణయించామన్నారు. అన్ని గ్రేడ్‌లకూ భారతదేశ వ్యాప్తంగా ఒకే ధరలు వర్తిస్తాయని, ప్లాటినమ్ పెరల్ వైట్ కలర్‌కు అదనపు ప్రీమియం వర్తిస్తుందని తెలిపారు.

విద్యా విధానంలో మార్పులకు శ్రీకారం: కన్నబాబు

విశాలాంధ్ర – కరప : ప్రభుత్వం విద్యా విధానంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. నక్క సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అందజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ బైజుస్ యాప్ ద్వారా విద్యార్థులకు విద్యను బోధించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ పేదలకు అందకూడదనే ఉద్దేశంతో అనేక పన్నాగాలు పన్ని ఆపేందుకు కోర్టులకు వెళ్లడం జరిగిందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి సంకల్పంతో ప్రతి పేదవాడికి ఇంగ్లీష్ మీడియంలో విద్యను అందించేందుకు నాడు నేడు పేరుతో స్కూళ్లకు కొత్త రూపురేఖలు తీర్చిదిద్ది ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌గా మార్చడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు కావలసిన పుస్తకాలు, యూనిఫార్మ్, షూస్, మొదలగున మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పించి కార్పొరేట్ స్కూల్‌లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడం జరిగిందని కన్నబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు పెంకె శ్రీలక్ష్మి, జడ్పిటిసి సుబ్బారావు, సర్పంచ్ ఆశాజ్యోతి ఎంపీటీసీలు భీమన్న, ఎంఈఓ బులి కృష్ణవేణి, తాసిల్దార్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు లీలా మనోహర్ వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

– సీఎస్ఆర్ కింద దేశ వ్యాప్తంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు

– పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డీజీఎం ఎస్ఎస్ఆర్‌కే ప్రసాద్

విశాలాంధ్ర – కాకినాడ : పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో), కాకినాడ జిల్లా పరిపాలనా యంత్రాంగం సహకారంతో 123 మంది

దివ్యాంగులకు సుమారు రూ.26 లక్షలు విలువచేసే ఉపకరణాలు అందించినట్లు పవర్‌గ్రిడ్ డీజీఎం ఎస్ఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. గురువారం దివ్యాంగులకు 251 రకాల ఉపకరణాల పంపిణీ కార్యక్రమం కాకినాడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద దేశ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ స్ఫూర్తిని ఇతర సంస్థలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలపై ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా సీపీవో పి త్రినాథ్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి వి కామరాజు, కాకినాడ రూరల్ ఎంపీడీవో జె శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు.

గడప గడపకు విజయవంతానికి సంఘటితంగా కృషి చేయాలి

విశాలాంధ్ర – అనపర్తి : అనపర్తిలో జనవరి 9 నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక అధికార పార్టీ నాయకులు సంఘటితంగా కృషి చేయాలని పార్టీ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) కోరారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సమాయత్త సభ సర్పంచ్ వారా కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాంబాబు మాట్లాడుతూ అనపర్తి గ్రామం అక్షర క్రమంలోనే కాక అభివృద్ధి పదంలోనూ ముందు వరసలో పయనిస్తుందని దీనికి పంచాయతీ పాలకవర్గంతో బాటు, ఎంపీటీసీ సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకుల కృషి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రోత్సాహం ఉన్నాయన్నారు. స్థానిక నాయకత్వం సంఘటితంగా గ్రామాభివృద్ధికి కృషి చేయడం ద్వారా మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని రాంబాబు ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ అనపర్తి పట్టణ కన్వీనర్ నల్లమిల్లి మురళి మోహన్ బాలకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు సన్మానం

విశాలాంధ్ర – ప్రత్తిపాడు : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియమితులు అయిన కాకినాడ జిల్లాకు వచ్చిన గిడుగు రుద్రరాజును, కాంగ్రెస్ పార్టీ జాతీయ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పళ్ళంరాజును, కాంగ్రెస్ పార్టీ జిల్లా

సీనియర్ నాయకులు ఇంటి వీరభద్రరావును, కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కళా వెంకటరావు భవన్‌లో ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఉమ్మిడి వెంకటరావు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడుకు, మాజీ కేంద్రమంత్రికు, సీనియర్ నాయకులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిసిసి మెంబర్ ధర్నాలకోట శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు కోప్పన కోటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మొయ్యేటి సూర్యప్రకాశరావు, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు కొల్లు వీరగణేష్, నియోజకవర్గం శక్తీ కో-ఆర్డినేటర్ ఉమ్మిడి సురేష్, రౌతులపూడి మండలం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యనుమల రాజా, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లతో కన్వీనర్లు సమన్వయంతో పనిచేయండి

విశాలాంధ్ర – యు కొత్తపల్లి : వాలంటీర్లతో కలిసి నూతనంగా నియమించబడిన కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని పిఠాపురం ఎమ్మెల్యే పెండం దొరబాబు అన్నారు. సోమవారం మండలంలోని స్థానిక వీవీఎస్ కళ్యాణ మండపం నందు ఏర్పాటు చేసిన కన్వీనర్ల, వాలంటీర్ల సమన్వయ సమావేశానికి పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కోవిడ్ కష్టకాలంలో వాలంటీర్లు సైనికుల్లా పనిచేసారని వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించినట్లు తెలిపారు.

ఏపీ నిట్‌కు రెండు జాతీయ పరిశోధనా ప్రాజెక్టులు మంజూరు

విశాలాంధ్ర – తాడేపల్లిగూడెం రూరల్ : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) రెండు జాతీయ పరిశోధనా ప్రాజెక్టులను దక్కించుకుంది. భారత ప్రభుత్వ ఆధీనంలోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్, డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (న్యూఢిల్లీ) సుమారు రూ 80 లక్షల విలువైన ఈ రెండు ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టులు రావడానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ సహాయ ఆచార్యులు డాక్టర్ తేజావత్ రమేష్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సుందరం భరణీ ధరన్ కృషి చేశారు. వీరిని ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎం ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ డాక్టర్ పి దినేష్ శంకర్ రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి ఆర్ కే శాస్త్రి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్‌లు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ పి దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వాహనాల రూపకల్పనకు, దేశంలో ఇంధన వినియోగాన్ని తగ్గించి వాహనాల కాలుష్యాన్ని అరికట్టడానికి ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. 2030 నాటికి 30 శాతం ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచి, నూరుశాతం బ్యాటరీ ఆధారిత బస్సులను వినియోగంలోకి తీసుకురావటానికి కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది అన్నారు. దీనిలో భాగంగా ఏపీ నిట్‌కు డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ మల్టీ లెవెల్ ఇన్వర్టర్ ఫేడ్ మల్టీ ఫేజ్ సెన్సార్లెస్ పర్మినెంట్ మ్యాగ్నెట్ సింక్రోనెస్ మోటార్ డ్రైవ్ పర్ హైబ్రిడ్ ఎలక్ట్రికల్ వెహికల్ అప్లికేషన్ విత్ రెడ్యూస్డ్ టర్క్యూ అండ్ ఫ్లక్స్ రిప్పేస్ (హైబ్రిడ్ ఎలక్ట్రికల్ వాహనాల కోసం మల్టీ లెవెల్ ఇన్వర్టర్ ఆధారిత మల్టీఫేజ్ సెన్సార్ల్ లెస్ పర్మినెంట్ మ్యాగ్నెట్ సింక్రోనెస్ మోటార్ డ్రైవ్ రూపకల్పన అభివృద్ధి) ప్రాజెక్టును ఏపీ నిట్‌కు కేటాయించిందన్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం సహాయ ఆచార్యులు రమేష్ ఆధ్వర్యంలో ఆటోమొబైల్ రంగంలో ఎలక్ట్రికల్ వాహనాలపై విస్తృత పరిశోధనలు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు విలువ రూ 53 లక్షలు. ప్రస్తుతం నాలుగు చక్రాల కార్లు, బస్సులు, అధికలోడు గల ఎలక్ట్రికల్ వాహనాల్లో ముఖ్యంగా 3 ఫేజ్ మోటార్లును ఎక్కువగా వాడుతున్నారు. వీటి పనితనాన్ని ఇంకా మెరుగుపరిచి , 5, 7 ఫేజ్ శాశ్వత మాగ్నెట్ ఆధారిత మోటర్లును రూపకల్పన చేయడానికి ఈ ప్రాజెక్టు ఎంతగానో దోహదపడుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా జల వాతావరణంలో మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు పరిశోధనలు చేసేందుకు అండర్ స్టాండింగ్ ద ఇంటరాక్షన్ బిట్వీన్ మైక్రో ప్లాస్టిక్ అండ్ హెవీ మెటల్స్ టు వెస్ట్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ అడశోరప్షన్ రిస్క్ అస్సెస్మెంట్ ("వ్యర్థ జలాల్లో మైక్రోప్లాస్టిక్స్ మరియు హెవీ మెటల్స్ మధ్య పరస్పర చర్యను అర్థం చేసుకోవడం - పంపిణీ, శోషణం, రిస్క్ అసెస్మెంట్") ప్రాజెక్టును కేటాయించింది. సివిల్ విభాగాధిపతి భరణీ ధరన్ ఆధ్వర్యంలో పర్యావరణ వత్తిడికి దారి తీస్తున్న పరిస్థితులపై పరిశోధనలు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు విలువ రూ 25 లక్షలు. సముద్ర తీరం వెంబడి అవక్షేపాల్లో ఉన్న మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణ వ్యవస్థలపై తీవ్ర వత్తిడికి దారితీస్తున్నాయి. దీనిమూలంగా సేంద్రీయ కాలుష్య కారకాలు, వ్యాధికారిక కారకాలు ఉపరితలంపై సులభంగా వ్యాప్తి చెందుతున్నాయి. జల వాతావరణంలో వాటి కదలికలు, ప్రవర్తనలను ప్రభావితం చేసే క్లిష్టమైన కారకాలు గురుంచి లోతైన పరిశోధనలు చేసేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది.

క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత

విశాలాంధ్ర – తాళ్ళపూడి : క్షయ వ్యాధి నిర్మూలన - టి.బి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాలలోని క్షయ రోగులను గుర్తించి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేసారు. సంస్థ మండల అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు సంస్థ తరపున పది

మంది వ్యాధిగ్రస్తులకు ఒక్కొక్కరికి 500 రూపాయల విలువ చేసే పౌష్టికాహార మరియు నిత్యావసర వస్తువులను కిట్ రూపంలో అందజేశామని జోడాల తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్నదేవరపేట నివాసి, మానవత సభ్యులు చెరుకూరి బంగారు బాబు వెయ్యి రూపాయల విలువైన పండ్లను పంపిణీ చేశారు. అవసరాలలో ఉన్న బీదలను ఆదుకోవండంలోనూ, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని ఆదుకోవండంలో సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మండల అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి సాయన సుబ్బారావు, ఈసీ మెంబర్ సనపల రాజశేఖర్, పూర్వ అధ్యక్షులు అప్పన చంద్రధరగుప్త, సభ్యులు కొయ్య నాగారాజు, వైద్య సిబ్బంది ఎలిపే శ్యామ్ సుందర్, బాదంపూడి భాగ్యలక్ష్మి, సబ్బిశెట్టి భీమరాజు, చెప్పుల ఆశాజ్యోతి, పెంటపాటి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు రీ సర్వే పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర – తాళ్ళపూడి : రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకముగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకములో భాగముగా మొదటివిడతలో జరిగిన రీ సర్వే లో సిద్ధం చేసిన పట్టాలను రాష్ట్ర హెూమ్ శాఖా మాత్యులు డా. తానేటి వనిత పంపిణీ చేశారు. తాళ్ళపూడి మండలము లో బల్లిపాడు గ్రామము నకు రీసర్వే పైలట్ ప్రాజెక్ట్ గా చేపట్టిన సర్వే పూర్తైనందున గురువారంనాడు నియోజక వర్గ స్థాయిలో కొవ్వూరు లో హెూమ్ మరియూ విపత్తుశాఖా మంత్రి శ్రీమతి తానేటి వనిత అధ్యక్షతన రైతులకు భూహక్కు పత్రములను పంపిణీ చేసారు.ఈ కార్యక్రమములో రెవెన్యూ డివిజనల్ ఎస్. మల్లిబాబు, తహశీల్దారు టి రాధిక, జెడిపి వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, సర్పంచ్ యెల్లిన శివరామ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం:ఎమ్మెల్యే ఎలిజా

విశాలాంధ్ర– జంగారెడ్డిగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో తమకున్న భూములు, ఇళ్ళు సర్వం త్యాగం చేసిన ప్రజలకు ఎమ్మెల్యే వి.ఆర్. కృతజ్ఞతలు తెలిపారు. చల్లవారిగూడెంలో నిర్మించిన పునరావాస కాలనీలో నివాసం ఉంటున్న వేలేరుపాడు మండలానికి చెందిన కటుకూరు, చిగురుమామిడి గ్రామాలకు చెందిన కుటుంబాలకు చింతల పూడి ఎమ్మెల్యే ఎలిజా చేతుల మీదుగా పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాసితులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నిజమైన త్యాగం ముంపు గ్రామాల ప్రజలైన నిర్వాసితులదే నని , వారికి అన్ని రకాలుగా సహాయ,సహకారాలు అందించడంలో అధికారులు ఎక్కడా అలసత్యం వహించవద్దు అని అధికారులకు సూచించారు. ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, వారికి అందించాల్సిన నష్ట పరిహారం విషయం లో ముఖ్య మంత్రి ని కలిసి విన్నవిస్తానని నిరంతరం తమ సమస్యల పరిష్కారం కొరకు తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం పలువురు లబ్ధి దారులకు ఆయన చేతుల మీదగా ఇళ్ళ పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ,వేలేరుపాడు ఎంపీపీ వల్ల లక్ష్మి దేవి, సర్పంచ్ సత్య వతి , జంగారెడ్డిగూడెం మండల వైసీపీ అధ్యక్షుడు వామిసెట్టి హరిబాబు, వైఎస్సార్సీపీ యూత్ అధ్యక్షుడు బద్దె ప్రేమ్ కుమార్, ఆ పార్టీ నాయకులు బ్రహ్మం, ,విజయ్ బాబు,రమణ ,కాలనీ అధ్యక్షుడు గీల్ల వెంకటేశ్వర్లు ,ఉపాధ్యక్షులు పెరుమాళ్ నరసింహ రావు,సుధాకర్ ,బాలకృష్ణ,లక్ష్మన్, వేలేరుపాడు,జంగారెడ్డి గూడెం మండలాల తహశీల్దార్ లు, విఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విశాలాంధ్ర – గొల్లప్రోలు : పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు పట్టణంలోని గురువారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గొల్లప్రోలు నగర పంచాయితీ వైస్ చైర్ పర్సన్ తెడ్లపు అలేఖ్యారాణి నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదేశాలు మేరకు గొల్లప్రోలు పట్టణంలో గల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నందలి సుమారు 100మందికి ట్యాబ్లు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధిలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకురావడం జరిగిందని అందులో ప్రధానంగా విద్యార్థులకు ట్యాబులను అందించి డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు. సమాజంలో ఉన్న అంతరాలను తొలగించడానికి ప్రతి విద్యార్థి కూడా ఉన్నత చదువులు చదువుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని విద్యార్థులు అందరూ కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.